# సంప్ పెళ్ళి!

మాలతీ చందూర్

"డ్రాడ్" అంటూ తుఫాన్ గాలిలా దూసుకు వచ్చింది. 'కా' అని పిలువబడే కామేశ్వరి.

'కా' వాళ్ళ నాన్న ప్లాస్టిక్ కుర్చీలో కూలబడి, పోస్టుబిళ్ళ వంటి కాగితాన్ని దీక్షగా చూస్తున్నారు మాగ్నిఫైయింగ్ గ్లాసెస్‌తో. నిజానికి అది పోస్టుస్టాంపుకాదు. న్యూస్ పేపరు. మైక్రోఫిలిమ్‌లో పది పేజీలుగల న్యూస్ పేపరుని పోస్టుస్టాంపు సైజులోకి కుదించి, ప్రింట్ చేసి ప్రతిఫ్లాట్ తలుపుకి స్టికర్‌లాగా అంటించి వెళ్ళిపోతూంటారు న్యూస్ పేపరు బాయిస్. ఈ సౌకర్యం 2015-సంవత్సరం ఆఖరుదాకానే. ఆపైన, ఎవరికి వారు షాపుల్లో బొత్తిగా పెట్టిన స్టికర్స్ వంటి యీ న్యూస్ పేపర్సుని తెచ్చుకోవాలన్నారు పత్రికల వాళ్ళు. అప్పటిదాకా యింటి తలుపుకి అంటించబడిని యీ న్యూస్‌పేపరు సౌకర్యాన్ని వారు పూర్తిగా అనుభవించి, ఆనందిస్తూ వున్నారు. 'కా' వాళ్ళ డాడ్ 'ఆ' అంటే ఆయనగారి పేరు ఆనందరావు. 2015 లో పేర్లన్నీ అక్షరాల్లోకి ఆ అక్షరాలని అంకెల్లోకి మార్చి కంప్యూటర్‌కి ఫీడ్ చేస్తే, తకీమని కావలసిన సమాచారం వచ్చేయటం చేత జనాభా అందరిపేర్లు మొదటి అక్షరంలో ఆగిపోతున్నాయి. అయితే ఇందుకు భిన్నంగా అక్కడా అక్కడా తమ పూర్తిపేర్లు వుంచుకొని వాటితోనే పిలిపించుకుంటున్న ఛాందసులు లేకపోలేదు.

ప్లాస్టిక్ కుర్చీ పూర్వపు గోనెపట్టా కుర్చీలకి మల్లే ప్లాస్టిక్ క్లాత్ కూర్చుందుకు అమర్చబడి వుంది. కర్రకుర్చీలు మ్యూజియమ్స్‌లో తప్ప కనిపించటం లేదు. అక్కడ, చెట్లూ విపరీతంగా కొట్టెయ్యటం చేత పచ్చని మొక్కా కలపా అన్నవి 'కా' తరం వారు చూడలేదు.

'డాడ్' అంది కా ముద్దు ముద్దుగా. కా వయస్సు యిరవై పాతిక్కీ మధ్యన వుంటుంది. క్లోజుగా కట్ చేసిన క్రాప్, హాఫ్‌నిక్కర్, చేతులు లేని శాండోబనీను. బనీను ముందు భాగాన గుండెల దగ్గర వున్న వుబుకుని బట్టి ఆ పిల్ల ఆడపిల్ల అయి వుంటుందని గ్రహించుకోటానికి వీలవుతోంది. లేకపోతే మొగపిల్లవాడు అనే అనుకోవచ్చు. అలా వుంది వేషం శరీరాకృతి. 'కా'కి-తెలుగు రాదు. ఇంగ్లీషు తప్ప వాళ్ళింట్లో ఎవరికీ తెలుగురాదు. 'కా' వాళ్ళ డాడీకి మమ్మీకి కూడా తెలుగు రాదు. తెలుగు మాటలు అర్థం అవుతాయి. అవి కూడా కాస్త నిదానించి కూడబలుక్కుంటే తప్పరాదు.

'డాడ్' అంది గారాలు పోతూ 'కా'.

'వాట్ డార్లింగ్' అన్నారు వొడిలో పెట్టుకున్న స్టిక్కర్‌లా వున్న న్యూస్ పేపరుని పక్కకి తోసి, కళ్ళకు పెట్టుకున్న భూత అద్దాల వంటి జోడును పక్కకి తీసిపెడుతూ. ఆ జోడుతో మనుషుల్ని చూస్తే వాళ్ళు భీకరాకారులు లాగానూ, రాక్షసుల్లాగానూ, గలివర్‌కి-కనిపించిన పెద్ద పెద్ద ఆకృతులుగానూ కనిపిస్తారు. ఆ కళ్ళజోడు పెట్టుకు చూస్తే మనిషి ముక్కు తలకాయంత సైజులోనూ, తలకాయ గది కైవారంలో ఖమడక గోడల మీదకి మడిచినట్లు వికృతం గానూ కనిపిస్తుంది. అంచేత నూస్ పేపర్లకి తప్ప వాడకూడదు ఆ జోడు.

'వాట్ డార్లింగ్?' అన్నారు 'ఆ' గారు కూతురు వంక ప్రేమగా చూస్తూ! 'ఆ'గారు కూడా నిక్కర్ తొడుక్కుని, కట్‌బనీన్ వేసుకున్నారు. మనిషి స్థూలకాయుడు కాబట్టి రుబ్బుడు పొత్రానికి బట్టలు తొడిగినట్లుగా వుంది.

"డాడ్ - నాకు సంప్ మారేజ్ కావాలి. నేను సంపు పెళ్ళిచేసుకుంటాను" అంది తండ్రి భుజం మీద తల ఆనించి ముద్దులు గుడుస్తూ.

'ఆ' గారు తేలు కుట్టినట్లు ఒక్క కేక పెట్టి కుర్చీలోంచి దభాలున లేచారు.

"ఏమిటి సంప్‌లో పెళ్ళా మళ్ళీ చెప్పు" అడుగుతున్నారు ఆదుర్దాగా. స్విమ్మింగ్‌పూల్స్‌లో పెళ్ళి, విమానాల్లో పెళ్ళి, పర్వాతాలమీద, అంతరిక్షంలో పెళ్ళి విన్నారు. అటువంటి పెళ్ళిళ్ళకు వెళ్ళి ఆనందించారు కూడాను. కాని సంప్‌లో పెళ్ళి ఇంతవరకూ ఆయన చూడలేదు.

"డాడీ సంప్ పెళ్ళి అది బాజాలు మంగళ సూత్రం, తలంబ్రాలూ.....జీడి చెప్పింది. నాకు అల్లాంటి 'సంప్' పెళ్ళి కావాలి" అంది మళ్ళీ తండ్రి మీదకి వాలిపోతూ.

'ఆ' గారు నీరసంగా, నిరుత్సాహంగా కూలబడ్డారు ప్లాస్టిక్ కుర్చీలో. జీడిగుంట ధనమ్మగారు అని పిలవబడే తన అత్తగారంటే 'ఆ' గార్కి-చచ్చే భయం. అసలు ఆవిడ పేరు తల్చుకుంటేనే ఒక విధమైన యిన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్‌తో 'ఆ' కృంగిపోతుంటారు. ఈ 'జీడి'గారు, ఆమెని ఆ పేరు పెట్టి పిలుస్తే వొప్పుకోరు. 'అత్తగారు' అని పిలవమంటుంది 'ఆ' గారిని. కూతుర్ని 'అమ్మా' అని పిలవ్వే అంటూ ఆజ్ఞలు జారి చేసింది. ముద్దుల మనుమరాలు 'కా' ఒక్కతె అమ్మమ్మా అనిగాక 'జీడీ' అని పిలుస్తుంది. మనుమరాలి మీద ఆమెకి విపరీతమైన ఆపేక్ష కాబట్టి అలా పిలుస్తే వూరుకుంది. మరొకరయితే నరికి పోగులు పెడతాను అంటూ ఛాలెంజ్ చేస్తుంది ఆవిడగారు.

జీడిగుంట ధనమ్మగారు 1942లో క్విట్ యిండియా వుద్యమంలో జైలుకెళ్ళి మూడేళ్ళపాటు జైల్లో వున్నారు. ఆ తరువాత రాజకీయవాదిగా, మంత్రిగా యం. పి. గా అనేక పదవులు నిర్వహించి తన నలభయ్యో ఏట మరో రాజకీయవాదిని పెళ్ళి చేసుకుని ఒక అమ్మాయిని కన్నారు. ఆ అమ్మాయే 'ఆ' గారి భార్య 'భా' అసలు పేరు భారతి. భారతమాతకి చిహ్నం తన కూతురు అని గర్వంగా చెపుతూంటారు జీడిగారు. ఆ రోజుల్లో అంటే 1960లో 'జీడీ'గారి పెళ్ళి చాలా విప్లవాత్మకంగా, అభ్యుదయ దృక్పధంతో జరిగింది.

దండలు మార్చుకుని వధూవరులిద్దరూ రిజిస్ట్రారాఫీసులో సంతకాలు పెట్టారు. వీరి ఆదర్శ వివాహం గురించి పత్రికలు, ప్రముఖులూ చాలా ఘనంగా చెప్పుకున్నారు.

'జీ. డి' గారి కూతురు 'భా'ని 'ఆ'గారు పెళ్లి చేసుకోవటం, వారికి 'కా' కలగటం, ఇవన్నీ అతి సహజంగా జరిగిపోయాయి. వచ్చిన చిక్కంతా – జీ. డి గారిపట్ల అల్లుడైన 'ఆ' గారికి గల కోపం, ఒకరకమైన భయం. ఆవిడ దయాధర్మంపై తాము ఆధారపడి వున్నామన్న భావం ఇవన్నీ ఆయనకి అత్తగారైన 'జీడి'పట్ల 'లవ్-హేట్'లు మిళితమైన ఒక భావం వుంది.

జీ. డి గారి భర్త, కూతురు కలిగిన పదేళ్ళకే గుటుక్కుమన్నారు. ఆవిడ రాజకీయాల్లో తల మునకలుగా తిరిగింది. రాజకీయాల్లోనే ఆమె తల పండిపోయింది. కొన్నాళ్ళు మంత్రి పదవి అలంకరించింది. అదీగాక స్వాతంత్ర్య యోధులకి ప్రభుత్వం కలిపించిన ప్రత్యేక సదుపాయంగా–నగరంలోగల ఫ్లాట్ ప్రస్తుతం 'ఆ'గారు వుంటున్న ఫ్లాట్, జీడిగారి సేవను గుర్తించి ప్రభుత్వం ప్రత్యేకం ఆమె పేరున 'ఎలాట్' చేసింది. అది మూడు గదులు గల ఫ్లాట్. ఆ బ్లాక్‌లో వారిదే పెద్ద ఫ్లాట్. వాళ్ళ మూడు కార్లూ పెట్టుకునేందుకు స్థలం కూడా వుంది. ఇంత సౌకర్యంగల ఫ్లాట్ తనకి ఛస్తే దొరకదని, 'ఆ'గార్కి బాగా తెలుసు. జీ. డి గారు ఈ నగరంలో వుండదు. పల్లెటూళ్ళో ఒంటిస్తంభం మేడకట్టుకుని వుంటున్నారు. డెంభై ఏళ్ళు పైబడినా దృఢంగా ఆరోగ్యంగా వుంటారు. అప్పుడప్పుడు మద్రాసు వస్తూ వుంటారు. మనుమరాళ్ని, కూతురూ వాళ్ళని చూసి వెళ్ళటానికి। ఆవిడ 'మా కాలంలో' అంటూ ఖబుర్లు మొదలు పెడితే, అంతా జారుకుంటూ వుంటారు అక్కడి నుంచి–ఒక 'కా' తప్ప। క్విట్ ఇండియా మూవ్‌మెంట్, ఆగస్టు పదిహేను అంటూ ఆవిడ కబుర్లు చెపుతుంటే, 'కా' కాలేజీ ఎగ్గొట్టి వింటూంటుంది. అటువంటి 'కా' ఎవరో అబ్బాయిని ప్రేమించి పెళ్ళి చేసుకోబోతున్నది. పెళ్లికొడుకు జీ. డి. గారికి నచ్చాడు. పై నెలలో పెళ్ళి అనుకుంటున్నారు. అందుకోసమే 'జీ డి' గారు మద్రాసు వచ్చారు, ఆ వచ్చినావిడ వచ్చినట్లు వూరుకోక 'సంప్' పెళ్లి అంటూ-'కా'కి కిరెక్కించి వూరుకుంది.

ఈ సంప్ పెళ్ళి అంటే ఎంత భయంకరమైన విషయమో 'ఆ' గార్కి తెలుసు.

"బేబీ – ఆ సంప్ పెళ్లి వద్దమ్మా" అన్నాడాయన కూతుర్ని బుజ్జగిస్తూ.

"నో డాడీ. మేమిద్దరం ఒకే నిర్ణయానికి వచ్చాం," అంది 'కా' మొండిగా.

"ఎవరిద్దరూ?"

"నేనూ నా ఫియాన్సీ."

"అది కాదమ్మా."

"ఏమిటోయ్, పెద్ద బెట్టు చేస్తున్నావ్. సంప్రదాయ సిద్ధంగా పెళ్ళి చేసుకోవాలని పిల్ల ముచ్చట పడుతుంటే." అంటూ రంగంలోకి దూకారు జీడి గారు.

తెల్ల ఖద్దరు చీరె. తెల్ల రవిక వేసుకుని, వేలు ముడి, మొఖాన పొడవుగా తిరుచూర్ణం, చేతిలో కర్ర నిటాగ్గా నిల్చుని ఆవిడ మాట్లాడుతుంటే, 'ఆ'గారు నత్తలాగా ముడుచుకుపోతూంటాడు.

ఆవిడ రిజిష్టర్ మేరేజ్ చేసుకుంది. తనకి రిజిష్టర్ మేరేజ్ చేశారు. ఇప్పుడు మనుమరాలికి సంప్రదాయసిద్ధంగా పెళ్ళి చెయ్యాలా? ఎందుకు? అడుగుదామనుకున్నాడు. కాని, అడగలేకపోయాడు. అత్తగార్ని చూస్తే ఆయనకి లోలోన భయం.

"శ్రమకదండి. అసలు పురోహితులు ఎక్కడ దొరుకుతారు?"

"నీకెందుకోయ్ నేను వున్నానుగా."

"డాడీ – నేను రైస్ పోసుకుంటానుగాపీ, ఆదేమి త...త ఏమిటి పేరు చెప్పవా?"

"తలంబ్రాలు పోసుకుని సలక్షణంగా పెళ్ళి చేసుకుంటానని పిల్ల సరదా పడుతుంటే, మధ్యన నీవెందుకు?" అన్నారావిడ. సగంమటుకే ఫ్రేమున్న కళ్ళజోడులోంచి చూస్తూ. ఆవిడకు చత్వారం లేదు, రాలేదు. దూరపు వస్తువులు కనపడవు.

ఆవిడ అల్లా చూసినపుడల్లా 'ఆ' గారికి తన చిన్నప్పటికి స్కూలు టీచరు జ్ఞాపకం వచ్చి ముచ్చెమటలు వస్తాయి.

"సరే మీ యిష్టం. నేనేమో డిన్నర్‌కి ఆటో మెషిన్ ఏర్పాటు చేశాను. మీరేమో యిలా అంటుంటే—"

"ఛీ నాకు ఆ సెల్ఫ్ సర్వింగ్ డిన్నరొద్దు." అంది 'కా' విసుగ్గా.

అప్పటికే 'ఆ' గారు రెండు వందల ఆటో డిన్నర్ టోకెన్లు కొనేసి వుంచారు. పెళ్ళి అయిపోయాక, అంటే దండలు మారుకున్నాక—అవి కూడా పూలదండలు కావు, పూలదండలు తెప్పించాలని ప్రయత్నించి విఫలమై ప్లాస్టిక్ దండలు ఏర్పాటు చేశారు. దండలు మార్చుకున్నాక ఒక్కొక్క అతిధి చేతిలో ఒకో టోకన్ పెట్టేస్తే వాళ్ళు ఆ టోకెను ఆటో మిషన్‌లో పడేస్తారు. పేపరు ప్లేట్లో చక్కగా వండిన పదార్థాలు వెయింగ్ మిషన్‌లో కార్డులా వచ్చేస్తాయి. అందరూ అవి తినేసి యిళ్ళకు వెళ్ళిపోవచ్చు. అక్కర్లేని వాళ్ళు ఆ టోకెన్ను మరునాటికి వాడుకోవచ్చు. హాయిగా బాదర బందీ లేకుండా అయిపోతుంది అనుకున్నారు. అట్లాంటిది ఈ 'సంప్' పెళ్ళి అంటూ రేకెత్తింది అత్తగారు-అనబడే జీడిగారు.



'ఆ'గారు కూతురికి వింత పద్ధతిలో సంప్ పెళ్ళి చేస్తున్నారన్న వార్త దావానలంలాగా వ్యాపించింది. వారు వుంటున్న బ్లాకులో సుమారు మూడు వందల ఫ్లాట్స్ వున్నాయి. 15 అంతస్థుల భవనం లిఫ్టులు వగైరాలతో ఆధునికంగా వుంటుంది. అన్ని కుటుంబాలవాళ్ళూ 'కా' పెళ్ళి గురించి వుత్సాహంగా చర్చించటం మొదలు పెట్టారు. వీరందరికి పెద్ద తల 'జీడి'గారు.

'ముందు పురోహితుడు' అన్నారు ఆవిడ. అతనెక్కడ దొరుకుతాడు అన్న వేట ప్రారంభమయింది. కోనసీమలో వుంటాడు. అక్కడ సంస్కృతం తెలిసిన ఘనాపాటీలు వున్నారు అవి విని 'ఆ'గారు పరుగెత్తాడు తన హెలికాప్టర్ వేసుకుని. అక్కడ, పిలకలూ, విబూదీ, పంచకట్టూ యిత్యాదివి ఆయనకు కనిపించలేదు కొబ్బరిచెట్లుమట్టుకు ఒకటీ రెండు చెల్లాచదరుగా వున్నాయి. చివరికి ఒక పురోహితుడిని పట్టుకున్నారు. ఆయనకి పెళ్ళి మంత్రాలు రావు సరిగదా ఎప్పుడూ వాటిని వినలేదుట. చిట్టచివరికి ఒక పాత రికార్డు, 1960 ప్రాంతాలనాటి ఒక పాత సినిమా రికార్డు వుంటే అది టేప్ చేయించుకుని ఆ టేపు ప్రకారం బట్టీపట్టి, పెళ్ళి రోజుకి తన హెలికాప్టర్ మీద వస్తానన్నాడు పురోహితుడు.

'ఆ'గారికి ఏనుగు ఎక్కినంత ఆనందమయింది. విజయగర్వంతో యింటికొచ్చిన ఆయనకి మళ్ళీ కొత్త సమస్య ఆరంభమయింది. తలంబ్రాలు- అవి ఎక్కడుంటాయి? ఎలా దొరుకుతాయి? తలంబ్రాలంటే బియ్యానికి పసుపు రాయటం - అని జీడిగారు తేలిగ్గా వివరించారుగాని ఆ బియ్యం ఎక్కడ దొరుకుతాయి అన్నది సమస్య.

ఎక్కడ చూసినా ఏకొట్లో చూసినా 'వండిన రైస్' తప్ప బియ్యం కనిపిండం లేదు. పాలీథిన్ బాగ్సులో అన్నం పెట్టేసి నీట్‌గా పాక్ చేసి అమ్ముతుంటే, అవి వెచ్చ చేసుకుని తినెయ్యటం తప్ప బియ్యం సంగతి అందరూ మర్చిపోయారు. బియ్యం అమ్మకూడదు, కొన కూడదు అని ప్రభుత్వం ఆర్డినెన్స్ జారిచేసింది. ఎలా, ఎలా? అత్తగారి మీద బ్రహ్మాండమైన కోపం వచ్చింది. 'ఆ' గారిక్కి, లేనిపోని 'సంప్' పెళ్ళి అంటూ చిరాకు పడిపోయారు.

"ప్రతి దానికి అలా ఖంగారుపడితే ఎల్లా, మీకు బ్రయిన్స్ లేవర్రా" అన్నారు జీ. డి గారు అల్లుడిని మెత్తగా మందలిస్తూ.

"ఇక్కడ బ్రయిన్స్ కాదు-రైస్ కావాలి" అన్నారు కసిగా 'ఆ'గారు.

"వస్తాయి తొందరపడకు. ఈ రాత్రి మన వాళ్ళందరికీ ఫోన్ చేద్దాం." అన్నారావిడ తాపీగా.

"ఎవరికి?"

"ఎవరికేమిటోయ్. మీ అన్నదమ్ములు, అప్ప చెల్లెళ్ళు, అందరూ తలో కిలో బియ్యం తెస్తే సరి."

"కస్టమ్స్ వాళ్ళు వూరుకోరు. బేడీలు వేస్తారు." అన్నాడు వెటకారంగా.

ప్రస్తుతం బంగారం స్మగుల్ చేస్తే ఎవరూ పట్టించుకోటం లేదు-బియ్యం ఒక్కగింజ తెచ్చినా సరే, సోదాచేసి పట్టుకుంటున్నారు. దానికి కారణం వుంది. చమురూ సహజ వాయువుల శాఖవారు వదేసి గజాలు తవ్వేసి, చమురు వుంది-అంటూ బెదిరించటంతో, పొలాల్లో ధాన్యం పండించటం అందరూ మానుకుని, తవ్వకాలు మొదలుపెట్టారు. చమురు పడినా లేకపోయినా ధాన్యం పండటం లేదు. అంచేత దేశంలో బియ్యం అన్నవి లెక్కబెట్టి అమ్మే స్థితికి వచ్చి మనిషికి యాభై గింజలు, నూరు గింజలు అంటూ లెక్కపెట్టి యిచ్చేవారు - 2010 ప్రాంతాల: మరీ అయిదేళ్ళ నుంచి అవి కూడా కనపడక-కేవలం రొట్టె, అన్నం యీ రెండే షాపుల్లో కనబడుతున్నాయి. అన్నానికి బియ్యానికి కరువు కాచిన ప్రజలను ఎక్స్‌ప్లాయిట్ చెయ్యటానికి బియ్యం స్మగుల్ చేసి, రూపాయికి యాభై గింజలు, పాతిక గింజలు - అని అమ్మారు కొన్నాళ్ళు. వీటికి ప్రజలు ఎగబడటం, తొక్కిడి అల్లర్లూ, కొట్లాటలు జరిగి ప్రభుత్వం బియ్యం వాడకాన్ని పూర్తిగా నిషేధించింది. అందుకని బియ్యం అన్నవి అపురూపమైపోయాయి మార్కెట్‌లో.

బియ్యం దేశంలోకి వస్తే అల్లర్లు పెరిగిపోతాయన్న వుద్దేశంతో, ప్రభుత్వం వండిన అన్నం దిగుమతి చేసుకుని, దానిని పోలిథిన్ బాగ్సులో పెట్టి అమ్ముతోంది. ప్రజలకి యీ పద్ధతి బాగానే వుంది. వెచ్చ చేసుకు తింటం తప్ప వొండే బెడద తప్పింది. అన్న చెడిపోకుండా, ఆహారపు విలువ తగ్గకుండా ప్రిజర్వ్ చెయ్యటంతో, మిగతా అన్ని తినుబండారాలు. వండినవి తప్ప వండుకోవలసిన అవసరం లేకుండా సరఫరా అవుతున్నాయి. ఇడ్లెన్లు దోసెలు, పులిహోర, అన్నం. యిలా, మాంసాహారం చేపలు అన్ని ఆహారపదార్థాలు వుడికినవి కొనుక్కు తినటం అలవాటయింది. పచ్చికూరలు, ఆకుకూరలు, పప్పులు యివి ప్రాచ్యవుస్తకాల్లో తప్ప మామూలు కళ్ళకి కనిపించటం లేదు.

"అందరూ తలో గుప్పెడూ బియ్యం తీసుకు రాలేరంటావా?" అడిగారు జీ. డి. గారు కాస్త అధైర్యంగా. ఆమె కంఠంలో పిరికితనాన్ని పసిగట్టి 'ఆ' గారు, యిదే అదను అనుకుని, "ఉహూ లాభం లేదు. పూర్వం మెటల్ డిటెక్టర్సుతో బంగారం కనిపెట్టేవారు. యిప్పుడు రైస్ డిటెక్టర్సు వచ్చాయి. ప్రతి ఏయిర్ పోర్టులో సామాను పూర్తిగా చెక్ చేస్తున్నారు?" అన్నాడు.

యిన్నాళ్ళకి అత్తగారిపై విజయం సాధించానన్న భరోసాతో.





విదేశాలనుంచి వస్తున్న స్నేహితులు ఫారెన్ పెర్ఫ్యూమ్స్, చీరెలూ, ఎలక్ట్రిక్ గాడ్జెట్‌లు ప్రజెంట్లుగా తీసుకురావటం వీటికోసం ఇక్కడి వాళ్ళు ఎగబడటం సర్వసాధారణమైపోయింది. కాని ఈ మధ్య స్టేట్స్‌కి వెళ్ళిన మా ఫ్రెండు సుందరి (ఈమె ప్రముఖ రచయిత్రి డి. కామేశ్వరిగారికి అక్క) అక్కడినుంచి జీడిపప్పు, ఏలక్కాయలు,లవంగాలు, జాజికాయ,జాపత్రి పొలిధిన్ బాగ్స్‌లో తీసుకొచ్చి మాకు ఇచ్చారు.

అవి చూస్తుంటే—మనదేశంలో దొరికే ఈ సుగంధ ద్రవ్యాలు ఎంత చెత్తగా, నాసిగా వుంటాయో అర్థం అయింది. జీడిపప్పు గుళ్ళు ఒకే సైజులో ఎక్కడా పుచ్చు లేకుండా తెల్లగా బాగున్నాయి. అక్కడి విశేషాలు చెపుతూ మూడు నెలల టూర్‌లోనూ రోజూ సాయంత్రం ఎలక్ట్రిక్ కుక్కర్‌తో అన్నం వండుకునేవాళ్ళమని తమతోపాటు మరో యిద్దరు సౌత్ ఇండియన్స్ రోజూ డిన్నర్ తీసుకునేవారనీ చెప్పారు. అక్కడి బియ్యం ఒక్క రాయి లేకుండా శుభ్రంగా నీట్‌గా పాక్‌చేసి వుంటాయట. ఎక్కడా మాకా రాళ్ళూ వుండవు. 'హొటల్లో కుక్కర్‌తో వండుకునే ఎలక్ట్రిక్ ప్లగ్ సదుపాయం వుంది' అన్నారు. ఇది మూడు నాలుగు నెలల క్రితం మాట.

తమిళనాడులో కాంగ్రెస్ పార్టీ పరాజయం పొందటానికి బియ్యం కరువు అన్నది చాలా మందికి జ్ఞాపకం వుండేవుంటుంది. పది పదిహేనేళ్ళ క్రితం బియ్యం కె. జీ. ఎనిమిది రూపాయలకి కొన్న సందర్భాలున్నాయి. సరిగ్గా ఆ టైములోనే మా యింట్లో బంధువులు ఒకసారి తమాషాకి ఒక కె. జీ. బియ్యం పొట్లం బజారునుంచి తెచ్చి-దాన్ని ఎనిమిది సమ భాగాలు చేసి - అందులో ఒక కుప్పని నా మేనకోడలు చాలా జాగ్రత్తగా లెక్క పెట్టింది. రూపాయికి అయిదు వందల బియ్యం గింజలు వొచ్చాయి.

ఆ రోజున మేము బియ్యం పరిస్థితి బాగు పడుతుందని అనుకోలేదు. ఇంకా దిగజారుతుందని, ఈమాత్రం కూడాఓపెన్‌మార్కెట్‌లో దొరకవని అనుకున్నాం. ఆ సమయంలో పెళ్ళి చేస్తే - పెళ్ళివారికి కట్నాలతోపాటు, 'ఇన్ని గింజల అన్నం పెడతాము. చెమ్చాతో తలంబ్రాలు పోసుకోండి.' — ఇత్యాది బేరసారాలు ఎంతో దూరంలో లేవు అనుకున్నాం.

ఆ తరువాత టెక్సాస్‌నుంచి ఒక ఫ్రెండు 'నిత్యతాంబూలాలు నోము పట్టాను. ఇక్కడ తమలపాకులు లేతవి దొరుకుతున్నాయి.' అని రాసినప్పుడు, ఇక లాభంలేదు, ఇండియా అమెరికాకి తరలివెళ్ళింది అమెరికా ఇండియాకి తరలి వచ్చింది. కల్చరల్ ఎక్స్‌ఛేంజిమాట ఎట్లావున్నా సరుకుల ఎక్స్‌ఛేంజిలో మనం ఎంత పోగొట్టుకుంటున్నామో అన్న ఆలోచన ఈ కథకి ప్రేరణ.

మాలతీ చందూర్

''ఒక పని చేస్తే? మన అమ్మాయికి వెడ్డింగ్ గిఫ్ట్‌లు పంపుతారుగా, వాటి మధ్య గుప్పెడు బియ్యం ప్లాస్టిక్ బాగ్‌లో పొట్లం కట్టి పట్రమంటే''

''అవి మటుకు చెక్ చెయ్యరా?'' అడిగారు 'ఆ' గారు.

''వాళ్ళు వస్తూ కాదయ్యా. ముందే ఎయిర్‌లో వెడ్డింగ్ గిఫ్ట్ పంపమని రాయి. పోస్టు బాగ్స్ ఎవరూ చెక్ చెయ్యరు. నీ వాళ్ళూ మా వాళ్ళూ కలిసి పాతికమంది వున్నారుగా। పాతిక గుప్పెళ్ళు నాలుగు దోసెళ్ళ బియ్యం అవుతాయి.'' అంది ఆవిడ. ఆ సమస్య అక్కడితో పరిష్కారమై పోయినట్లు.

బియ్యం పంపించటానికి దారి దొరికింది గాని పెళ్ళికూతురు పట్టుచీరె, పూలజెడ పెద్ద సమస్యలయి కూచున్నాయి. సింథటిక్స్ తప్ప పట్టుచీరెలు ఒకటి రెండు చోట్లగాని నెయ్యటం లేదు. ఇక్కడ కూడా జీ. డి. గారు తనకి గతంలోగల రాజకీయపు చతురతని ఉపయోగించి — ముఖ్య మంత్రిని కలుసుకుని, అతి కష్టం మీద ఒక పట్టుచీరె సంపాయించారు. ఆ చీరె కట్టుకుని ఎలా నడవాలో పెళ్ళికూతురు పదిరోజుల పాటు ముందుగా రిహర్సల్స్ చేసింది. పెళ్ళికూతురికి పూలజడకు అనువైన విగ్గు తెప్పించారు.

ఇవన్నీ ఒకొక్కక్కటీ అమరుతున్నప్పుడు 'ఆ' గారికి కూడా వుత్సాహంగా ఘనంగా వుంది. తన చుట్టుపక్కల వాళ్ళు ఎవ్వరూ చెయ్యనంత ఘనంగా—తాను తన కూతురు పెళ్ళి చేస్తున్నానని. పెళ్ళి కబుర్లు ఏర్పాట్లు ప్రతి రాత్రి టెలిఫోన్సులో మాట్లాడుకోవటం చేత-టెక్సాస్‌లో వున్న 'ఆ' గారి చెల్లెలు ప్లేన్ ఎక్కుతూ ఒక కట్ట తమలపాకులు, పోలిథిన్ బాగ్‌లో పాక్ చేసిన వక్కలూ కూడా తీసుకొచ్చారు. 'ఆ' గారి తమ్ముడు — ఆయన ఫ్రాన్సులో వున్నాడు. వస్తూ గులాబీ పువ్వులు— ఎర్రరంగు గులాబీ గుత్తులు బొకేలు కట్టించి తీసుకొచ్చాడు. ఆ బొకేలు విప్పి పెళ్ళికూతురుకి గులాబీ పువ్వుల జడ కుట్టారు.

పెళ్ళిలో బిస్మల్లాఖాన్ పాతరికార్డులు సంపాయించి వాటిని టేప్‌చేసి పెట్టారు. పెళ్ళికొచ్చిన అతిధులందరూ పెళ్ళికూతుర్ని - పెళ్ళికొడుకునీ చూడలేదు. వాళ్ళు పోసుకున్న తలంబ్రాల బియ్యాన్ని, అమ్మాయి కట్టుకున్న చీరెని, తలలో పువ్వుల్ని, తమలపాకుల్ని కేవలం వెర్రిగా చూశారు. ఇటువంటి అద్భుతమైన ఆకులు — ఒక రకమైన సువాసన గల ఆకులు, ఎక్కడ దొరుకుతాయి. ఎక్కడ దొరుకుతాయి? అంటూ వెర్రెత్తిపోయి అడిగారు.

'ఆ' గారు గర్వంగా చూశారు. కాని జీ. డి. గారు నిట్టూర్చి ''ఇవన్నీ మనదేశంలో పండినవే నట్రా. మనం తింటానికి నోచుకోలేదు. దొంగ చాటుగా తెచ్చుకున్నాం-'' అంటూ విచారించారు. ఆవిడ మాటలు ఎవరకీ అర్థం కాలేదు. కాని, ఆరోజు తమలపాకు ముచ్చిక చేజిక్కించుకున్న వాళ్ళు చైతం యీ అద్భుతమైన 'సంప్' పెళ్ళి గురించి, తమ పిల్లలకీ — మనుమలకీ జ్ఞాపకం వుంచుకుని చెప్పారు. □